క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుర్కయంజాల్: సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ టీఎస్ఐఐసీ నాదర్‌గుల్ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం, గైరాన్‌కోట, ఎంఎస్ఆర్ హోమ్స్, ద్వారకాపురి, మత్రిగూడ, రంగన్నగూడ, కుర్మల్‌గూడ, ఎస్‌వీ ఆర్ హోమ్స్, ఇందిరానగర్, జీఎస్ఎస్‌యూఆర్‌ఎం, అగ్రికల్చర్, ఆదిబట్ల మెయిన్‌రోడ్, ఆయుధాల గడ్డలో సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు.

ఎల్మినేడు పరిధిలో..

ఇబ్రహీంపట్నం రూరల్: ఎల్మినేడు సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆదిబట్ల విద్యుత్‌శాఖ ఏఈ జయన్న ఒక ప్రకటనలో తెలిపారు. కప్పపహాడ్ 11 కేవీ ఏజీఎల్ ఫీడర్ మీద లైన్లకు తాకే చెట్టు కొమ్మలను తొలగించడం జరుగుతుందన్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

మండల కేంద్రంగా ప్రకటించండి


గట్టుప్పలపల్లిలో దీక్షలో గ్రామస్తులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం గట్టుప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని మండల సాధన జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్ డిమాండ్ చేశారు. గట్టుప్పలపల్లిని మండల కేంద్రంగా చేయాలని కోరుతూ గ్రామంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఎల్లయ్య, రామచంద్రయ్య, వెంకటయ్య, అంజయ్య, యాదగిరి, వెంకటేశ్, అనిల్, ఆంజనేయులు, శరత్చంద్రలు దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం గట్టుప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గట్టుప్పలపల్లిని మండల కేంద్రంగా చేయడానికి సహకరించాలని ఆయన కోరారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత


బోగ్ బండార్ పూజలో జర్పుల తండావాసులు

మాడ్గుల: ప్రతిఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని బీఆర్ఎస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు జర్పుల విజయ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జర్పుల తండా గ్రామ పంచాయతీలో సోమసాత్ బాపు బోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. దైవచింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పూజారి సీతారాం బావోజీ, గోపి, జన్యా, రాములు, బిక్కు, రాగ్యా, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక పనులు ప్రారంభించండి


కమిషనర్‌కి వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలోని ఎనిమిదో వార్డులో మంజూరైన శ్మశానవాటిక పనులు త్వరితగతిన ప్రారంభించాలని కౌన్సిలర్ గోపగళ్ల మహేందర్ కోరారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కౌన్సిలర్ మాట్లాడుతూ.. కొంగరకలాన్‌లో 8వ వార్డుకు శ్మశానవాటికకు నిధులు మంజూరు చేశారని, నేటికి పనులు ప్రారంభించకపోవడం దారుణమన్నారు. వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. స్పందించిన కమిషనర్ పనులు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

కొందుర్గు: మండలంలోని పర్వతాపూర్ గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ గ్రామ నాయకులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. అడిగిన వెంటనే స్పందించి అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి గ్రామంలో లోఓల్టేజీ సమస్య తీర్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డికి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఏళ్లు గడిచె.. రోడ్డు మరిచె

- నత్తనడకన సాగుతున్న గుర్లకుంటతండా రహదారి పనులు
- కంకర పరిచి వదిలేయడంతో రాకపోకలకు ఇక్కట్లు


కంకర పోసి వదిలేసిన కడ్తాల్-గుర్లకుంటతండా రహదారి

కడ్తాల్: ఏళ్లు గడుస్తున్నా తండావాసులకు రహదారి వెతలు తీరడం లేదు. మండల పరిధిలోని గుర్లకుంట తండాకు బీటీ రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించినా నేటికీ బీటీ వేయకపోవడంతో తండావాసులకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఇదిగో చేపడుతామంటూ కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2022లో అప్పటి ప్రభుత్వం కడ్తాల్ నుంచి గుర్లకుంటతండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి సీఆర్ఆర్ నిధులు రూ.కోటి నిధులు మంజూరు చేసింది. 2023లో ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. గుత్తేదారు తండాకు వెళ్లే రోడ్డు నిర్మాణ పనులను సాగు దీస్తూ వచ్చారు. దీంతో తండావాసులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

తరచూ ప్రమాదాలు

కడ్తాల్ నుంచి గుర్లకుంట తండాకు వెళ్లాలంటే చెరువుకట్ట మీదుగానే రాకపోకలు సాగించాలి. ఈ మార్గంలో దాదాపు కిలో మీటర్ మేర కంకర వేసి వదిలి వేయడంతో స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై కడ్తాల్ మండల కేంద్రానికి సమీపంలోనే గుర్లకుంటతండా ఉంది. కానీ అక్కడికి వెళ్లాలంటే అసంపూర్తి రోడ్డుతో విసిగి పోతున్నామని వాహనదారులు తెలుపుతున్నారు. తరచూ ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. ఈ మార్గంపై గతంలో స్కూల్ బస్సు ప్రమాదానికి గురైంది. ఈ పరిణామాన్ని దృష్టిలో పెట్టుకొని త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు. అదే విధంగా గుర్లకుంట అలుగు వద్ద కల్వర్టు నిర్మాణం చేపట్టాలని, తండావాసులు విన్నవిస్తున్నారు.

కట్టపై వెళ్లాలంటే భయం



చెరువు కట్టపై కంకర వేసి వదిలేయడంతో రాత్రివేళతో పాటు పగటి పూట ప్రయాణించాలంటే భయమేస్తుంది. ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి తరచూ ప్రమాదాలు బారిన పడుతున్నారు. త్వరగా రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి వాహనదారులకు ఇబ్బందులు తొలగించాలి.

– శంకర్‌నాయక్, గుర్లకుంటతండా

సమస్య పరిష్కరించండి



ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చినా రోడ్డు సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. 2023లో ప్రారంభించిన పనులు నేటికీ పూర్తి కాలేదు. రోడ్డుపై కంకర పోసి వదిలేశారు. తండావాసుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

– రాంచందర్‌నాయక్, గుర్లకుంటతండా

బీజేపీ నేత వ్యాఖ్యలు సిగ్గుచేటు

- యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు ప్రియాంకగాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎంపీ రమేశ్ బిధూరీని వెంటనే బీజేపీ నుంచి సస్పెండ్ చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో జాతీయ రహదారిపై యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోసురవి ఆధ్వర్యంలో రమేశ్ బిధూరీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ.. మహిళల పట్ల బీజేపీకి గౌరవం లేదన్నారు. అందుకు బిధూరీ వ్యాఖ్యలే నిదర్శనమన్నారు. వెంటనే అయన్ని సస్పెండ్ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇమ్రాన్, భానుకిరణ్, శ్రీకాంత్, రామకృష్ణ, సాయికుమార్, లింగం, శ్రీకాంత్, వెంకటేశ్, సురేశ్, మహేశ్, కుమార్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంపై దాడి పిరికిపంద చర్య

- జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి

ఆమనగల్లు: నగరంలోని బీజేపీ ప్రధాన కార్యాలయంపై యూత్‌కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దాడి చేయడం పిరికిపంద చర్యని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, కాషాయ పార్టీ నేత ఆచారి అన్నారు. కాంగ్రెస్ పార్టీ తమ తీరును మార్చుకోకపోతే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పోలీసుల సమక్షంలో బీజేపీ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ దాడికి పాల్పడటం దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రజాస్వామ్యంలో హింసా రాజకీయాలకు తావు లేదన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కరువైందని ఆరోపించారు. బీజేపీ కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిని వెంటనే చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

వైద్య శిబిరానికి స్పందన

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలో మంగళవారం ఉప్పల, రాధాకృష్ణ, గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్టుల సంయుక్త ఆధ్వర్యంలో కామినేని ఆసుపత్రి వైద్యుల సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్‌తో కలిసి ఆర్యవైశ్య సంఘం నాయకుడు గంప శ్రీనివాస్‌గుప్తా ప్రారంభించారు. డాక్టర్ అఖిల్ నేతృత్వంలోని వైద్య బృందం 285మందికి పైగా రోగులకు బీపీ, షుగర్‌తో పాటు, వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు.

దివ్యాంగులకు పరికరాల పంపిణీ

యాచారం: సత్యసాయి సేవా సదన్ సహకారంతో మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉన్న దివ్యాంగులకు మంగళవారం సహాయ పరికరాలను అందజేశారు. సత్యసాయి సంస్థ పేద, బడుగు వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తుందని నిర్వాహకులు దినవస్రావు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడ దివ్యాంగులకు అండగా ఉంటామని ఆయన తెలిపారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- ప్రగతి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ అలోక్ అగర్వాల్


మాట్లాడుతున్న డాక్టర్ అలోక్ అగర్వాల్

షాద్‌నగర్‌రూరల్: పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే ప్రతీ ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రగతి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ అలోక్ అగర్వాల్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బూర్గుల గ్రామంలో ఉన్న ప్రగతి వెల్ఫేర్ సొసైటీలో పోషకాహార లోప నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆశవర్కర్లు, అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులకు బరువు, ఎత్తు, కొలతతో ఏ విధంగా నిర్ధారణ చేయాలో తెలియజేశారు. అనంతరం డాక్టర్ అలోక్ అగర్వాల్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలకు వచ్చే విద్యార్థులకు పోషకాహార లోపాన్ని గుర్తించాలని సూచించారు. పోషకాహారం లోపం ఉన్న విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించి వారి ఎదుగుదలకు తోడ్పాటును అందించాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు శంకర్, మురళీ, కార్తీక్, శ్రీకాంత్, తులసీ, లావణ్య, జగదీశ్, శృతి, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పాఠశాలలో వసతుల కల్పనకు కృషి

- ఎంపీడీఓ సంధ్య

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అందరం సమష్టిగా కృషి చేద్దామని మండల అభివృద్ధి అధికారి సంధ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అధికారులు నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇబ్బందులను తీర్చేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ పరమేశ్వరి పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం/యాచారం: మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం ఎస్టీయూటీఎస్ ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన, ఉపాధ్యాయుల సమస్యలపై ఎస్టీయూటీఎస్ కృషి చేస్తుందని ఆ శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండు రంగారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ పాండురంగారెడ్డి, హెచ్ఎం నర్సింహ, సంఘ సభ్యులు బాలకృష్ణ, జగన్మోహన్‌రెడ్డి, రాందేవ్‌రాజు, సల్మాన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నంలో ఎస్టీయూటీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈఓ హీర్యానాయక్ ఆవిష్కరించారు. సంఘం మండల అధ్యక్షుడు తిరుమలేశ్ పాల్గొన్నారు.

సహకార సంఘం ఆధ్వర్యంలో…

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను సంఘ చైర్మన్ చేగూరి భరత్ కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నార్లకొండ మల్లమ్మ, డైరెక్టర్లు జైపాల్‌రెడ్డి, బాలనర్సమ్మ, యాదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, మేనేజర్ ఐలేష్‌యాదవ్ నాయకులు జంగమయ్య, భూపాల్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



యాచారం: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్టీయూటీఎస్ సభ్యులు

కలెక్టర్ పర్యటన రద్దు

- ఆగ్రహం వ్యక్తం చేసిన భూ బాధితులు
- పరిహారం అందించాలని ఎల్మినేడు భూ పోరాట కమిటీ డిమాండ్


ఎల్మినేడులో పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

ఇబ్రహీంపట్నం రూరల్: టీజీఐఐసీ భూ సేకరణలో భాగంగా భూములు కోల్పోయిన బాధితులకు పరిహారం అందించాలని ఎల్మినేడు భూ పోరాట కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం గ్రామానికి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డిలు వస్తున్నారని భూ బాధితులు హాజరు కావాలని ముందస్తుగా డప్పు చాటింపు వేశారు. దీంతో ఉదయం 10:30కి భూములు కోల్పోయిన బాధితులు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. 12 గంటలు దాటినా అధికారులు రాకపోవడంతో విసిగిపోయారు. ఆకస్మికంగా పర్యటన వాయిదా వేసినట్లు సమాచారం రావడంతో రైతులు ఆగ్రహానికి గురయ్యారు. పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అధికారులు గ్రామానికి రావాలని నినాదాలు చేశారు. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు. న్యాయంగా జాబితా సిద్ధం చేసి ప్రభుత్వానికి సిఫార్సు చేయాలన్నారు. దండోరా వేయించి కార్యక్రమం రద్దు చేయడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. త్వరలోనే అధికారులు గ్రామంలో పర్యటించి నిజమైన లబ్ధిదారులకు పరిహారం అందించేలా చూడాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భూ పోరాట కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి దివంగత కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి పేరు పెట్టడం అభినందనీయమని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు నర్సింహ అన్నారు. పట్టణంలో జాతీయ రహదారిపై రాజీవ్ చౌరస్తా వద్ద మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగు జిల్లాలకు సాగు, తాగునీరు అందించే ప్రాజెక్టుకు జైపాల్‌రెడ్డి పేరు పెట్టడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, ఖలీల్, జగన్, మానయ్య, ఫరీద్, సాయి, మహేశ్, ఖాదర్, అలీం పాల్గొన్నారు.

పల్లెప్రగతితో అభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: పల్లె ప్రగతి కార్యక్రమంతో తెలంగాణలోని గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ జాతీయ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థలో నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా బిహార్‌కు చెందిన బ్లాక్ ప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, వ్యక్తిగత మరుగుదొడ్ల, పల్లె ప్రకృతి వనం, ఇంకుడు గుంతల నిర్వహణ, తడిపొడి చెత్త వేరుచేసే విధానాలపై చర్చించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రత్యూష పట్నాయక్, మేనేజర్ అరుణ్‌రాజ్, బిహార్ బ్లాక్ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నట్లు తెలిపారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

- పట్టణ సీఐ విజయ్‌కుమార్


దాతలను సన్మానిస్తున్న సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: నేరాలను నియంత్రించడంలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని పట్టణ సీఐ విజయ్‌కుమార్ అన్నారు. మాజీ ఉపసర్పంచ్ సింగారం సుదర్శన్ కోరిక మేరకు సీనియర్ జర్నలిస్టు గణేశ్ మిత్రబృందం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని హాజిపల్లి గ్రామంలో గల దేవాలయం వద్ద రూ.38వేలతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సీసీ కెమెరాలను మంగళవారం సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు గ్రామస్తులు తమవంతు సహాయసహకారాలను అందించాలన్నారు. అనంతరం సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన సీనియర్ జర్నలిస్టు గణేశ్, పెంటారెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఐ బలరాం, నాయకులు ప్రవీణ్‌కుమార్, నవీన్‌కుమార్, శ్రీనివాస్, రామప్ప, శశిధర్, ప్రశాంత్, ప్రభాకర్, శంకర్, రాములు, మల్లేశ్, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

- ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య నివాసంలో ఆయన చేతుల మీదుగా ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం(జీటీఏ) జిల్లా కేలండర్‌ను ఆ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలన్నారు. నాణ్యమైన బోధనతో ఉత్తమ ఫలితాలు రాబడితే ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతాన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీటీఏ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహ, ప్రధాన కార్యదర్శి టి.సుధాకర్, జిల్లా మహిళా కార్యదర్శి టి.సునీత, ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.వీరన్న, జిల్లా బాధ్యులు జి.వెంకటరమణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

రోడ్ల నిర్మాణానికి రూ.91.51 కోట్లు

- కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి


గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పనులు ఆపాలని ఎమ్మెల్యే నారాయణరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సాకిబండతండా రైతులు

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలోని వెల్దండ, చారకొండ, కల్వకుర్తి మండలాలలో బీటీరోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.91.51 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఇప్పటికే ఆమనగల్లు, మాడ్గుల, వెల్దండ మండలాలలో బీటీరోడ్లు, పాఠశాలల అభివృద్ధి, మౌలిక వసతులకు రూ.204 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని వెల్దండ, కల్వకుర్తి, చారకొండ మండలాలలో 13 బీటీరోడ్ల నిర్మాణానికి, 5 బ్రిడ్జిల నిర్మాణానికి రూ.91.51 కోట్లు విడుదల చేశారన్నారు. నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. సమావేశంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, సంజీవ్‌యాదవ్, భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో మండలంలోని మంగళపల్లికి చెందిన మెండె శ్రీనుకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.60 వేల చెక్కును అందజేశారు.

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పనులు ఆపండి

ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు నిర్మించే గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పనులు ఆపాలని ఎమ్మెల్యే నారాయణరెడ్డిని ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సాకిబండతండా రైతులు కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాండు, రాజు, రవిరాథోడ్, బాలు, గోపాల్, నార్య, జైపాల్, దేవేందర్, మహేశ్, మహిపాల్ తదితరులు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డును ఆపాలని కోరుతూ వినతిపత్రం అందించారు. రోడ్డు నిర్మాణానికి ఉన్న కొద్దిపాటి భూమి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.